## వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించి శ్రీ బాబూజీకి శ్రీ లాలాజీ యిచ్చిన ఆదేశాలు

**[The Autobiography of Ram Chandra - Part-II, Vol.I (Preparation)]**

11-5-44: మంచి జరిగినప్పుడు ఆనందించడం, చెడు జరిగినప్పుడు విచారించడం అనునది లేకుండ ఉండునట్లు నీవు అలవాటు చేసుకొనుము.

18-5-44: వినయ (humble feeling) భావము నా అలవాటు. అది నీవు అలవరచుకోవలయును. 'ప్రభువు ప్రాంగణము నందు నేను భిక్షకుడను' అను భావము నా లక్షణము. దానిని నీవు ఎన్నడూ విడనాడకూడదు. అయినప్పటికి ప్రవర్తన చక్రవర్తి ప్రవర్తన వలె ఉండవలెను. నీవు కఠినముగ ఉండవలెను. మెత్తని దనము అలవాటును విడిచి పెట్టవలయును. నేను, నీవు ఏ విధముగ ప్రవర్తించవలెనని అనుకుందునో, అదే విధముగ నీవు తు.చ. తప్పకుండ సరిగా అలాగే చేయవలయును.

19-5-44: నీవు సంపన్నుడవై ఉండి కూడా, నన్ను ఏ క్షణము మరువలేదు.

ఎవరైనా నమ్మకము గురించి నేర్చుకొనగోరిన అది నీ నుండి నేర్చుకొనవలెను.

ఆదేశములు: 1. నీటి కాకి నీటిలో మునిగి పైకి వచ్చిన తరువాత కూడ అది పొడిగానే ఉండును. నీరు ఏ మాత్రము అంటదు. ఆ మాదిరిగానే జీవితమును నీవు మలచుకోవలయును. 2. నీ సత్సంగమునకు సంబంధించిన సోదరులను ప్రేమింపుము. నీ అలవాటు ప్రకారము జరిగే సంభాషణ మృదువుగను, మధురముగను ఉండు శైలినే ఉపయోగించవలెను. 3. మిత్రుని, శత్రువుని ఒకే విధముగ చూచి ఇద్దరి శ్రేయస్సునూ కోరవలెను. పొగడ్త సంస్కృతికి (బుద్ధి వికాసమునకు) ఆటంకము. ఈ విషయమును గురించి నేను శరీరములో ఉండగా నా ఉదాహరణ నుండి నేర్చుకొనుము.

20-5-44: ఇతరులు నిన్ను వెయ్యి విధములుగ నిందించవచ్చు. నీవు దానిని భరించాలి. దీని అర్థము నిన్ను ఎవరైనా నిందించినా తిరిగి నీవు నిందించవచ్చు, వారిని కొట్టవచ్చుకూడా, కాని ఆ వ్యక్తికి ఎన్నడూ నీ హృదయము నుండి చెడు తలంపకుము.

25-5-44: ప్రశ్న: గురువుగారికి ముందువున్న పెద్దలందరి బాంధవ్యాలు కూడ గమనించి పాటించవలెనా ?

సమాధానము : అన్ని బాంధవ్యాలు గురువుగారి లోనే ఇమిడి ఉన్నవి.

26-5-44: నీ నిరాడంబరతతో (simplicity) అందరినీ జయించావు.

27-5-44: హద్దు మీరిన అలవాట్లను త్యజింపుము. మితతత్వమును (moderation) అలవరచుకొనుము.

5-6-44: నీకు ఎక్కువ బాధ కలిగినప్పుడు నావలెనే పాడటము ప్రారంభించుము. అప్పుడు దానిలోనికి ఆకర్షింపబడి బాధ తగ్గును.

Scanned by CamScanner

3-7-44: నేను కూర్చుండుటకు ఏర్పాటుచేసిన స్థలములో నా ఫొటోగ్రాఫ్‌ను ఉంచకూడదు. నేను ఫొటో తీయించుకొనునట్లు నన్ను కొంతమంది బలవంతము చేసిరి. ఇప్పుడు ఫొటోగ్రాఫ్‌ను పూజించడము మొదలైనది.

8-7-44: ప్రజలు నన్ను చనిపోయిన వాడినిగా నిర్ణయించుకున్నారు. వారు అట్లు నిర్ణయించుకున్నప్పుడు ప్రాణాహుతి ప్రవాహములో కూడ నిరోధము సృష్టించబడినది. ఎక్కువ మంది ప్రజలు నాతో సంబంధము కొనసాగించలేకపోయిరి.

10-7-44: వ్యామోహము (attachment) దేనియందైనను, అది ఎటువంటిది అయినను సరే ఆధ్యాత్మికతకు హానికరము.

13-7-44: గురువుగారి ఆలోచన తప్ప వేరే మరొక వ్యక్తి యొక్క ఆలోచన వారికి రాకూడదని వారిని హెచ్చరించాలి. దీనికి వ్యతిరేకమైన వారిని ఎవరినైనా యిదికాక మరియొక చోటు చూసుకోమని చెప్పవలెను. ఈ స్థలము వారికి పనికి రాదని కూడా చెప్పవలయును. ఇది ఈ సంస్థకు పునాది.

వృథా సంభాషణలు కూడదు (అనగా కాలక్షేపము కొరకు చేసే సంభాషణలు). అసందర్భపు సంభాషణలు (సంవాదములు) పనికిరాదు. కాల్పనిక కథా సాహిత్యమును చదువుట ఆపివేయవలెను. హృదయము గురువుగారి యందు ప్రేమతో తప్ప యితరుల యందు ప్రేమతో మలినము కాకూడదు. స్నేహము యందు వేలం వెర్రి విడిచిపెట్టవలయును. భగవంతుని మాత్రమే స్నేహితునిగా స్వీకరించవలెను. భక్తిపూరితమైన (దివ్య ప్రేమతో నిండిన) మతగ్రంథములను చదువవచ్చు. జటిలమైన, గంభీరమైన, తత్త్వశాస్త్ర అధ్యయనము అవసరము లేదు. వ్యక్తుల యందు పరస్పర ప్రవర్తన సోదరభావంతో ఉండాలి (ఒకరి యందు మరొకరు సానుభూతి కలిగి ఉండటము, అవసరమైనప్పుడు ఉపయోగపడటము). మంచి ప్రవర్తన కలిగియుండటము ఈ పద్ధతి యొక్క ముఖ్యాంశము. ప్రతివ్యక్తి ఈ సంస్థ యొక్క మూలసూత్రములను అనుసరించవలయును. ఉదయమే మేల్కాంచడం, ధ్యాన సాధన, ప్రార్థన సలుపుట, గృహకార్యములను సక్రమముగా నిర్వర్తించడము అను మంచి నడత వంటి సూత్రములకు కట్టుబడి ఉండుట అనేది ప్రతి ఒక్కరి బాధ్యత.

15-7-44: నీ మనసులో ఉంచుకోవలసిన విషయములు రెండు. 1) ఆరోగ్యము 2) ఆత్మగౌరవము (Self-respect). నేను ఈ విధముగ విన్నవించుకొంటిని: "ఇతరులు తన యెడల ఏది చేయకూడదు అని భావింతునో దానిని నేను యితరులకు చేయకూడదు" అని ఆత్మగౌరవమును అర్థము చేసికొంటిని.

సమాధానము: ఇది యంతయు సత్యయుగము నాటిది. ఆత్మగౌరవమనగా యితరుల యందు ముభావముగా ఉండుట ; యితరులు ఎక్కువగా మాట్లాడుటకు అవకాశము ఇవ్వకపోవుట, అనగా వాదోపవాదములకు ఎక్కువ వ్యవధి యివ్వకపోవుట ; అయిన వారికి కాని వారికి యింటి రహస్యాలు చెప్పకుండుట ; తాను బలహీనుడనని

Scanned by CamScanner

అనుకోకుండుట, ఇతరులకు నీయందు అమర్యాదగా ప్రవర్తించుటకు అవకాశము నీయకుండుట, ఇవన్నీ ఆత్మ గౌరవము అన్నపదమునకు అర్థము.

18-7-44: నీకు దేనియందు కోరికలేదు. ఇదియే నిజమైన త్యాగము (sacrifice)

21-7-44: మొరటుగా (Blunt) మాట్లాడే అలవాటు విడిచి పెట్టమని M1 తో చెప్పుము. ఎందువలననగా అది ప్రజలను బాధించుటయే కాక వారు ఎదురుతిరుగు (hostile) నట్లు చేయును. మన సంభాషణ ప్రేమతో నిండి పొర్లుచున్నట్లు ఉండవలెను. ఒక్క భగవంతుడొక్కడే ఏ లోపము లేనివాడు. తప్పులెన్నుటయే ఒక తప్పు. అది తప్పులెన్ను వారికే ప్రమాదము తెచ్చిపెట్టును. M1 నాతో కొన్నాళ్లు నివసించి ఉండినట్లయితే నాలో కూడా తప్పులు పట్టేవాడు.

31-7-44: మానవ నైజము వలన ఆలోచన ఒక చెడువైపునకు మరలి నప్పుడు వెంటనే మంచి ఆలోచన తీసుకురావలయును. అందువలన చెడు ఆలోచన, మంచి ఆలోచన వలన నిరర్థకమై పోయి సరిసమానత ఏర్పడును.

9-8-44: ఆధ్యాత్మికతకు సత్ప్రవర్తన ముఖ్యము.

11-8-44: సంశయించే అలవాటు మానుకొనుము. అది హానికరము.

17-8-44: కోపము చెడ్డది కాదు. కాని దానిని ఉపయోగించుట తగిన విధముగ ఉండవలెను. సంతోషకరమైన ప్రవర్తన అన్నివైపుల నుండి కానవచ్చునట్లు, ఆనందమె ధ్యేయముగ మనిషి తన జీవిన విలువలను మలచుకొనవలెను. మితతత్వము యింకనూ లాభదాయకము. అనగా పంచేంద్రియ బలగము నంతనూ అదుపులో ఉంచుట మితతత్వమునకు అర్థము. కోపమును ఉన్నది ఉన్నట్లుగానే ఉంచడము జరిగినది.

తరువాత పూజ్య గురువుగారు మనము పాటించవలసిన కొన్ని జీవన సూత్రములను సూచించిరి.

(1) హృదయము మలినము కాకుండ పిల్లలను జాగ్రత్తగా సాకుతూ వారిని పెంచవలెను. మనకు వారి యందు గల అనురాగము మనకు బాధ కలిగించకూడదు.

(2) సంసారమునకు భార్యాభర్తలు రెండు చక్రములుగా భావించి, భర్త భార్యను తనకు సర్వ విషయముల యందు సహాయ కారిగా చేసుకొనవలయును.

(3) ఇరుగుపొరుగు వారితో సత్సంబంధములను కొనసాగించుతూ, వారిని నీ వారిగా భావించవలయును. అందువలన వారు కూడా నిన్ను వారివానిగా భావించెదరు. ఇదే సూత్రము స్నేహితుల యందు కూడ పాటించవలెను.

(4) బంధువులతో బాంధవ్య బంధము తెగిపోయినట్లుగనే ప్రవర్తించవలెను. కాని వారి కష్టసుఖములలో వారిని ఆదుకొనవలయును. ఇది అందరితోనూ అదే విధముగ ఉండవలయును. బంధువులతో ఆర్థిక సంబంధమైన వ్యవహారములు లేకుండ చూసుకొనవలయును. వారి అవసర సమయములలో ధనసహాయము వారు తిరిగి యివ్వకపోయినను మనకు బాధ కల్గించనంతగా ఉండవలయును.

Scanned by CamScanner

(5) మన కంటె పై అధికారులతో వారి అధికారమును ధిక్కరించే విధముగా మన ప్రవర్తన ఉండకూడదు. దీనివలన కలిగే లాభము భగవంతుని నుండి వచ్చినదిగా భావించవలెను.

(6) మన సలహాలను గౌరవించని వారికి సలహాలు యివ్వకూడదు. ప్రమాదకరమైన అనారోగ్యములో అడుగకుండ మందులు సలహాలు యివ్వకూడదు. ఇక రోగి చేయి దాటిపోవుచున్నాడు అని అనుకుంటే తప్పదు. ఈ అలవాటు షాజహాన్‌పూర్ సాంఘిక జీవనములో చాల అధికముగ ఉన్నది.

(7) వ్యక్తిగత సేవలు తిరిగి వాటిని వారికి అందించగలిగినప్పుడే స్వీకరించవలెను. నిస్సహాయత వేరే విషయము.

(8) తన స్వంత రహస్యములను యితరులకు తెలియనీయరాదు. ఇతరుల నుండి ఏదో దాచుచున్నట్లు కూడ భావము ఎదుటి వారికి కలుగ నీయరాదు.

(9) లేనిపోని, అనవసరమైన అనుబంధములు లేకుండ అతి సామాన్యమైన (simple) జీవితమును గడుపవలెను.

(10) సాధ్యమైనంతవరకు వ్యాకులతను (worry) దరికి రానీయకూడదు. ఒకవేళ వచ్చినను, అది భగవంతుని నుండి వచ్చినదని తలంచి అందులకు ఆయనకు కృతజ్ఞత తెలుపవలయును.

(11) ఆహార, పానీయ విషయముల యందు యిష్టానిష్టములకు లోను కాకుండ, దానియందు (flat taste) ఉత్సాహము లేకుండ ఉండు స్థితిని పెంపొందించుకొనవలెను. దానిని తీసుకొనుట తగినదా కాదా అను విషయము కూడా దృష్టిలో ఉంచుకొనవలయును.

(12) సర్వము గురువుగారికే అర్పించవలయును. నేను చెప్పేది డబ్బు విషయము కాదు. సర్వము అతనిదే అనుభావముతో జాగ్రత్త వహించి దానిని సొంతము వలె కాపాడవలెను.

(13) గురువుగారి భార్యయందు, పవిత్రులైన పెద్దవారి యందుండు పూజ్య భావము కలిగియుండవలెను. గురువుగారి కుటుంబ సభ్యులనందరిని తన స్వంత కుటుంబ సభ్యులవలె భావించవలెను. గురువుగారి పిల్లల యందు కూడా అదే భావము కలిగియుండవలెను. కుటుంబ సభ్యుల ముందు సంఘ కట్టుబాట్లకు అనుగుణమైన సంబంధ బాంధవ్యములను అనుసరించవలెను.

(14) సత్సంగి సోదరులతో వారిలో ఆనందము కలుగునట్లు ప్రవర్తించవలయును. అందువలన వారి ఆధ్యాత్మిక పురోగతి వృద్ధి చెందును. ప్రత్యక్ష ప్రతిఘటన (Direct opposition) తప్పు. (సూటిగా వ్యతిరేకించడము హానికరము).

(15) విషయలాలసత (sensuality) విషయములో కఠినముగా ఉండుట ఉచితము. స్త్రీల శిక్షణ విషయంలో నేను చెప్పిన పద్ధతి అనుసరించుము. నేను ఎల్లప్పుడూ ఈ

Scanned by CamScanner

విషయంలో జాగ్రత్తగా ఉండేవాడిని. నేను చాల అనుభవము మీద ఈ సూత్రములను సమకూర్చడమైనది. కాని ఎవరూ వీటిని పాటించలేదు.

26-8-44: ఒక సలహా : ఒక వ్యక్తి సర్వకార్యములను చక్కబెడుతూ వాటితో సంబంధము లేకుండా ఉండగలిగినట్లయిన అతను చాల ఉన్నతుడు.

5-9-44: మృదుత్వమును (softness) పెంచుకొనుటకు పద్ధతి : మనలో అత్యంత వినయ (humility) స్వభావమును అలవరచుకొనవలయును. అందువలన తనలో ప్రేమ భావము నిండి పోయి ఇతరుల మనస్సును ఏ విధముగను నొప్పించజాలదు. అందువలన అతని మాటలు యితరుల మనస్సును ఎట్టి విధముగ నొప్పించవు. ఇది అందరి విధి. ఇదియే గురువు అడుగు జాడలలో నడచుకొనుట అనునది. ఇది నా ప్రత్యేక పద్ధతి. ఎవరూ దీనిని అనుకరించలేదు.

2-9-44: సరియైన మనోవికాసము చిన్నతనములోనే జరుగును. ఆ వయసులో చూపిన శ్రద్ధ, శ్రమ మాత్రమే భవిష్యత్తులో పనిచేయును.

5-9-44: ఉద్రేక స్వభావము (Irritation) విడిచిపెట్టి సహనము (patience) అలవరచుకొనుము. అప్పుడు వినయ విధేయతలు(submission), ఆత్మార్పణ (surrender), దైవానుగ్రహము వలన వాటివెంబడే సంభవించును.

**Vol.II**

19-10-44: శ్రీ కృష్ణభగవాను నుండి ఆదేశము (నూతన ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతిలో జీవన విధానము గురించి) :

మానవ జీవనమునకు సంబంధించిన నియమ సూత్రములు అతి సరళమైనవి(simple) గా ఉండవలెను. సత్యమునే పలుకు అలవాటును పెంపొందించవలెను. అనవసరమైన శ్రవణ, దృశ్య, ఆకర్షణల నుండి దూరముగ ఉండవలెను, పిల్లల యందు ప్రేమ, పెద్దల యందు గౌరవము, తల్లిదండ్రుల సేవ, నీతి(honest)బద్ధమైన జీవితము, మంచి హృదయము కలిగియుండుట, అన్యుల ఆస్తిపై ఆశలేకుండుట, యితరులను బెదిరించు మనస్తత్వము విడనాడుట, నిర్మలప్రశాంత చిత్తమును కలిగియుండుటకు ప్రయత్నించుట, ఇతరుల హృదయమును గాయపరచు మాటలు మాట్లాడకుండుట. అయినప్పటికి ప్రాణాపాయము నందు శత్రువునెదుర్కొనుటకు కత్తిదూయుట నిషేధము కాదు. ఈ కత్తి దూయుట ఆత్మరక్షణ కొరకు, ఇతరులను రక్షించుటకు మాత్రమే అని గుర్తుంచుకొనవలెను.

24-10-44: పూజ్య గురువులు సహజమార్గ సాధకులకు ప్రాథమిక సూత్రములను ఆదేశించిరి :

1. మన సంస్థలో నమ్మకమునకు (faith) (విశ్వాసమునకు) ఎక్కువ ప్రాముఖ్యమీయబడినది. అది ప్రథమ సోపానము. దానిని పరిపక్వము కావించుట ప్రతిసాధకుని కర్తవ్యము. ఇది లేనిదే సరియైన లాభము చేకూరదు.

2. ప్రతి సాధకుడు ఈ సాధనము వలన తనకు మేలు జరుగునా లేదా యని ప్రథమముగా నిర్ణయించుకొనవలెను. ఇది అనుభవము వలన నిరూపింపబడును.

Scanned by CamScanner

అప్పుడు తన నమ్మకము పరిపక్వమొందించు వైపు మనసును మరలించవలెను. గురువుగారి ఆదేశముల కనుగుణముగ ప్రవర్తించుట తన కర్తవ్యముగ భావించవలెను.

3. ఈ పద్ధతిలో సాధకుడిని పరమ సత్తలో (ultimate being) ప్రాణాహుతి ద్వారా సంధించడము ఇంద్రజాలము కాని, కృత్రిమ నిద్రాస్థితి కాని కాదని సాధకునికి అర్థమగునట్లు తెలియజేయవలెను. ఈ సహజ మార్గములో ఈ ప్రాణాహుతి ముఖ్యమైనది. అతను తన హృదయ పూర్వకముగా నిర్ణయించుకుని గురువుయందు నమ్మకముంచక పోయినట్లయిన అతనిచే సాధన ప్రారంభింపబజేయడము అనవసరము.

4. శీల (character) పరిశీలన ముఖ్యము. బ్రహ్మచర్యము (celibacy) తప్పనిసరిగ అవుసరము.

29-10-44: మానవుడు తన జీవితములో అసూయ(envy), తనది అనుభావన (ownness) పూర్తిగ దూరమయినపుడు అతడు మోక్షమును పొందును. ప్రేమ అనగా గురువుగారి ఆజ్ఞను శిరసావహించి ఏ విధమైన సందేహము లేకుండ నిర్వర్తించడమే. అనగా గురువుగారి ఆజ్ఞ నిర్వహణ యందు మనసు తనంత తాను నిమగ్నమై అందుకు ప్రయత్నించుట.

13-12-44: అవసానదశలో ఆధ్యాత్మిక స్థితులు ఏమీ చేయలేవు. మితతత్వము అవుసరము. సర్వత్రా అది లోపించినది. ఆధ్యాత్మికత ఒక్కటే నిరుపయోగము. ఆధ్యాత్మికత నైతిక విలువలతో జోడింపబడినప్పుడే దాని విలువ యినుమడించును.

6-12-44: స్వామి వివేకానందుల నుండి ఆదేశము :

ఒక విషయము గుర్తుంచుకొనవలెను. జీవితములో అన్ని దశలలోను వ్యక్తి తన గురువు యొక్క నియమ నిబంధనలకు కఠినముగ కట్టుబడి యుండవలెను. అప్పుడు తప్పనిసరిగ విజయము లభించును. సూర్యోదయమునకు పూర్వమే నిదురలెమ్ము.

22-12-44: స్వామి వివేకానంద నుండి ఆదేశము : నీవు సజ్జనుల సాంగత్యములోనే మెలగుము. నీవు చెప్పునది చేయుము, చేయునది చెప్పుము. ఆదిలోనే విజయమును గురించి ఆలోచింపకుము. లక్ష్యము పూర్తి అగువరకు నీకు నిర్దేశింపబడిన పనిని నీవు నిర్వర్తించుము.

23-2-45: ప్రశిక్షకులు (trainers) నా నైతిక స్వభావమునకు (సాధులతకు, సౌశీల్యమునకు) ప్రతీకలుగ (ఉదాహరణములుగ) తయారు కావలెను. ఈ విషయమునకు ఎక్కువ ప్రాముఖ్యము నీయవలెను. దీనిని శక్తివంతము చేయుటకు ప్రార్థనా పద్ధతులు ఉపయోగించవలెను.

7-3-45: మనము మాట్లాడునప్పుడు శబ్దము(voice) లోని హెచ్చుతగ్గులు తగ్గించుటకు ప్రయత్నించవలయును.

Scanned by CamScanner